# భం గురువాణి

29 జనవరి, 2026 సంచిక-251




## మానవ మనస్సు ఒక మహత్తర శక్తి

ఒక గ్రాము యురేనియంలో అంతర్గతంగా ఎంత శక్తి ఉంటుందంటే మూడు కోట్ల 30 లక్షల గుర్రములు ఒక గంట కాలం పనిచేస్తే ఎంత శక్తికి సమానం అవుతుందో అంత శక్తి ఒక గ్రాము యురేనియంలో దాగి ఉంటుందని శాస్త్రవేత్తలు, విజ్ఞానులు అంటారు. అలాగే ఒక సంవత్సరం పాటు 25 వేల ఇండ్లకి కావలసినటువంటి విద్యుత్ శక్తిని కేవలం 20 పౌనుల యురేనియం నుంచి పొందవచ్చు అంటారు. ఇది హాస్యాస్పదంగా కనబడవచ్చు. వెనుకటి కాలంలో ఒక మహా సైన్యం దండెత్తి వస్తూ ఉంటే ఒక మహానుభావుడు ఒక గడ్డి పరికను మంత్రించి వేస్తే ఆ సైన్యం అంతా నాశనం అయిపోయింది అంటే ఈరోజు మనం నవ్వుకుంటాము.

ఒక గ్రాము పదార్థంలో అంత శక్తి అంతర్గతంగా దాగివుంది అంటే మనమే కాదు పెద్ద పెద్ద విజ్ఞానులు, పెద్దలు కూడా అవహేళన చేసినారు. అయితే ఒక విజ్ఞాని దీనిని సత్యం అని ప్రయోగ పరీక్షల ద్వారా నిరూపించాడు. ఆ విజ్ఞాని ఎవరో కాదు ఆయనే ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. భౌతిక ప్రపంచంలో మనకు కనపడకుండా ఉన్న అనేక పదార్థాలలో అంతర్గతంగా ఎంతో శక్తి నిగూఢమై ఉన్నది అనే విషయాన్ని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అనే విజ్ఞాని తెలిపినాడు.

మన ఊహకు అందని ఆ శక్తిని ఆ విజ్ఞాని ఎలా కనుగొన్నాడు? ఆ ప్రేరణ అతనికి ఎక్కడనుంచి వచ్చింది అంటే వాని చింతన మంతనల నుంచి ఆ విషయం బయటకు వచ్చింది. మరి ఆ చింతన మంతనలు అతనికి ఎక్కడ నుండి వచ్చాయి? ఆ విజ్ఞాని యొక్క మనసు నుంచి వచ్చినాయి. అంటే మానవుని యొక్క మనసులో అంతర్గతంగా ఆలోచన అనేటటువంటి మహత్తరమైన శక్తి దాగి ఉన్నది అని అర్థము.

మనిషి యొక్క మనసులో దాగి ఉన్న మహత్తరమైన శక్తిని ఎవడు మనిషికి తెలుపుతాడో వాడే గురువు. మనిషి యొక్క మనసులో అంతర్గత ప్రయాణం చేసి అతనిలో దాగి ఉన్న మహత్తరమైన శక్తిని, ఆ వెలుగును వెలికి తీసే శక్తి ఒక్క సద్గురువుకు మాత్రమే ఉంది. కనుక శిష్య భక్తాదులారా మీరందరూ కూడా ఒక సద్గురువును ఆశ్రయించి మీ మనసులో ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకొని మంచి ఆలోచనలతో అటువంటి మహత్తరమైన జ్ఞానాన్ని పొందగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

Great power is hidden inside both matter and the human mind. Just as scientists discovered energy inside matter, a person can discover great strength and wisdom inside their own mind. A true Guru helps a person to understand this inner power and remove ignorance. With right guidance and good thoughts, one can gain knowledge, clarity, and a better life.